మేఘన

విద్యాధరి

తెల్లవారుఝాము నాలుగ్గంటలకి అలారం మోగింది. మేఘన చప్పున లేచి అలారం ఆఫ్ చేసింది. నిజానికి నిద్రమత్తుతో కళ్ళు విప్పుకోవడం లేదు. కానీ తప్పదు. పరీక్షలు ప్రారంభమయ్యాయి. కనీసం ఎనభైశాతం మార్కులు రాకపోతే – తనకీ, అమ్మకీ నాన్నచేతిలో శిక్షలు తప్పవు. అమ్మకోసమైనా తను బాగా చదవాలి. గత నెలలో జరిగిందంతా గుర్తొచ్చింది. దసరా నవరాత్రులు ప్రారంభమయ్యాయి. పట్నం నుంచి రావాల్సిన నాట్యగత్తె రాలేదట.

నిర్వాహకులు చాలా కంగారుపడిపోయారు. వాళ్ళల్లో తమ స్కూలు తెలుగు మాస్టారూ వున్నారు. ఆయనకి వెంటనే తను జ్ఞాపకం వచ్చిందట. స్కూలు డాన్స్ ప్రోగ్రామ్స్‌లో తను పాల్గొంటూ మంచిపేరు తెచ్చుకుంది. అలా ఆయనకి తను గుర్తొచ్చి ఇంటికొచ్చి అమ్మతో మాట్లాడారు. అమ్మ ఒప్పుకోలేదు.

''వాళ్ళ నాన్నగారు చండశాసనులండీ – స్కూల్లో కూడా ఏదో చేస్తుందిగానీ – వాళ్ళ నాన్నగారికి తెలీదు. కనీసం పాటపాడినా ఊరుకోరు'' అంది.

''మీరలా అనకండమ్మా – అమ్మాయికి టాలెంటు ఉంది గామట్టే అడుగుతున్నాను. సాక్షాత్తు అమ్మవారికి కానుకగా ఈ ఒక్కసారికీ నాట్యం చేయమనండి. నా పరువు కాపాడండి'' అంటూ తన మాటల చాతుర్యం చూపించారాయన.

అమ్మ ఆలోచించింది. నాన్న ఊరెళ్ళారు. మరో నాలుగు రోజుల వరకూ రారు. సరే– అమ్మవారికి సేవ అనుకుందాం అని –

''సరే – ఈ ఒక్కసారికేనండి – ఐనా దాని ముఖం, దానికి డాన్సేం వచ్చండీ'' అంది.

''అమ్మమ్మ – భలేవారే. సంగీతం, నాట్యం, ఆ తెలివితేటలు, అందం, అణకువ – ఇవన్నీ ఆ పిల్లకి పుట్టుకతో భగవంతుడిచ్చిన వరాలు కదండీ. రాయేదో, రత్నమే నిపుణుడికి తెలీదా. ఆ పిల్లకి స్వయంగా తెలుగు మాస్టార్ని! నాకు తెలీదా? సరే, సాయంత్రం ఆరు గంటలకల్లా భోజనం పెట్టేసి తీసుకురండి. ఏడు గంటలకి ప్రోగ్రాం. చిన్నపిల్లకదా ఎలా చేసినా బావుంటుంది'' అన్నాడాయన.

సరే – సాయంత్రం ఆరుగంటలకల్లా అమ్మా, నయనక్క, తనూ, చెల్లెళ్ళు కాంచన, భావన ప్రోగ్రాం జరిగే స్థలానికి వెళ్ళారు. తనకు భలేగా మేకప్ చేశారు. మెరిసిపోయే బట్టలు, రాళ్ళ నగలు, జడ కుప్పెలతో పువ్వుల జడ, చేతుల నిండుగా గాజులు, లిప్‌స్టిక్, తళుకు బొట్టు – అద్దంలో చూసుకుంటే తనేనా? ఎవరైనా రాజకుమారీనా – అన్పించింది.

ప్రోగ్రాం మొదలయింది. శుక్లాంబరధరం పాడారు.

''అమ్మా, మేఘనా. భయపడకు. నీ ఇష్టమొచ్చినట్టు డాన్స్ చేయి'' అన్నారు మాష్టారు.

తెర లేచింది. తను ప్రవేశించే సరికే అంతా హోరెత్తినట్లు చప్పట్లు, ఈలలు. పాట ప్రారంభమైంది. నిజానికి ఏం పాటలకి తను డాన్స్ చేయాలో కూడా తెలీదు. అడుగులు కలిపింది.

రాధ పాడుతోంది – కృష్ణుడిమీద. పాటకి అనుగుణంగా తను నర్తించింది. హావభావాలతో, చలాకీగా చేసింది.

రెండోపాట ''పిలచినా బిగువటరా – ఔరౌర – తానే వలచివచ్చినా'' భానుమతి పాట. విన్నపాట కాబట్టి చక్కగా అభినయించింది. మూడోది – మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో – తర్వాత రాజశేఖరా నీపై మోజు తీరలేదురా. అలా అలా వాళ్ళ దగ్గరున్న పాటలన్నీ పెట్టారు. రెండు గంటల సేపు – అవిశ్రాంతంగా నాట్యం చేసి అలసిపోయింది. అమ్మ 'ఇక ఆపేయండి' అంది.

నిర్వాహకులు చాలా సంతుష్టులై వెయ్యిన్నూటపదహార్లు ఇచ్చి, అప్పటికప్పుడు పెద్దది వెండిపళ్ళెం తెప్పించి ఇచ్చారు.

ఇంటికొచ్చాక అక్క నయన, చెల్లెళ్ళు కాంచన, భావన తనను అబ్బురంగా చూడసాగారు. అమ్మ దిష్టితీసిపారేసింది.

నాన్నగారు వచ్చారు. రావడం రావడమే రావణాసురుడిలా వచ్చారు. దారిలో ఎవరో చెప్పారట – ''మీ రెండో అమ్మాయి మేఘన చాలా బాగా డాన్స్ చేసిందండీ'' అని. ఇహనేం తనకి తన్నులు, అమ్మకి తిట్లు, బీభత్స వాతావరణం – అదుగో అప్పుడు – పిడుగుల వర్షంలా ప్రకటించారు – ''మేఘా! ఈ హాఫియర్లీ పరీక్షల్లో కనీసం ఎనభై శాతంకి ఒక్క మార్కు తక్కువైనా మీ అమ్మని ఇంట్లోంచి గెంటేస్తాను. జ్ఞాపకం ఉంచుకో'' అన్నారు. టెన్త్ గదా మరి!

''మా అమ్మ దేవత. ఆమెకి ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి పరిస్థితి రానీయను నాన్నగారూ'' అంది తను.

అప్పట్నుంచీ తెల్లవారుఝాము నాలుగ్గంటలకే లేచి చదవడం అలవాటు చేసుకుంది. తల విదిలించి జ్ఞాపకాలను వదిలి లేచి ఆరుబైటకొచ్చింది.

నల్ల పట్టుచీర మీద జరీ పువ్వుల్లా మెరుస్తున్నాయి నక్షత్రాలు. జాజిపందిరి గుభాళిస్తోంది. మసక వెలుతుర్లో సైతం శ్వేత గులాబీలు తలలూపుతూ పలుకరిస్తున్నాయి. చల్లని గాలి. లోపలికి వచ్చి టేబుల్ ల్యాంప్ ఆన్‌చేసి చదువు ప్రారంభించింది. ఆరుగంటల వరకూ ఏకబిగిని చదివేసింది. కాస్త రిలాక్స్‌కోసం టీ.వీ. పెట్టింది. తేజ టి.విలో భక్తి ప్రోగ్రాం ఏదో వస్తూంది. ఉపన్యాసకుడు అంటున్నాడు – ''మనం బలహీనులం, ధనంలేనివారం, బుద్ధి లేనివాళ్ళం, ఏమీ చాతగాని వాళ్ళం. కానీ ఎప్పుడైతే మనం దేవుని ఆశ్రయించి కోరుకుంటామో –అన్నీ ఆ దేవుడే ఇస్తాడు. తీరా ఇచ్చాక దేవుడ్ని మర్చిపోతాం. అంతా నేనే అన్న గర్వాహంకారాలతో నిండిపోతాం. ఎలాగంటే – ఈ చిన్న కథ వినండి. ఓ ఏనుగు, ఏనుగు మీద చిట్టెలుక ఓ చెక్క వంతెన దాటుతున్నాయి. బరువుకి వంతెన అదిరింది. ఊగిపోయింది. చిట్టెలుక ఏనుగు మీద చిందులేస్తూ – పొగరుగా ఏనుగుతో అంది – ''చూశావా? మన బలానికి వంతెన అదిరిపోతుంది' అని. ఏనుగు తనలో నవ్వుకుంది. వంతెన దాటాక ఏనుగు చిట్టెలుకతో – ''ఏదీ రెండుసార్లు ఆ వంతెన మీద నడువు. వంతెన అదిరితే చూడాలని ఉంది'' అంది. చిట్టెలుక పకపక నవ్వి ''చిటికెలో వంతెన వణికిపోదూ'' అంటూ ఇట్నుంచి అటూ, అట్నుంచి ఇటూ పరుగులు పెట్టి ఆగి చూసింది. వంతెన ఆవగింజలో నూరో వంతైనా అదరలేదు. అప్పుడది ఏనుగు చెవిలో వినయంగా ''కేవలం నీ బరువుగల అడుగుల వల్లే వంతెన అదిరింది'' అని చెప్పింది. భక్తులారా – మనం కూడా వినమ్రంగా ఒప్పుకుందాం – కేవలం .. కేవలం దేవుని దయవల్లే, అపార కరుణాసముద్రుడి వల్లే ఈరోజు సజీవంగా వుండి అన్నీ సక్రమంగా జరుపుకుంటున్నాం.''

నాన్నగారు వచ్చారు. రావడం రావడమే రావణాసురుడిలా వచ్చారు. ఇహనేం తనకి తన్నులు, అమ్మకి తిట్లు, బీభత్స వాతావరణం – అదుగో అప్పుడు – పిడుగుల వర్షంలా ప్రకటించారు – ''మేఘా! ఈ హాఫియర్లీ పరీక్షల్లో కనీసం ఎనభై శాతంకి ఒక్కమార్కు తక్కువైనా మీ అమ్మని ఇంట్లోంచి గెంటేస్తాను. జ్ఞాపకం ఉంచుకో'' అన్నారు.

''చదువుకోవడానికని లేచి టీ.వీ. చూస్తున్నావా?'' ఉలిక్కిపడి వెనుదిరిగి చూస్తే – తల్లి! వెనక ఆవులిస్తూ అక్క నయన. ఠక్కున టి.వి. ఆఫ్‌చేసి బుక్ అందుకుంది. నయన ఇంటర్ సెకండ్ ఇయర్. ఆ పిల్ల కూడా పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది.

తల్లి వాకిలి వూడ్చి, కళ్ళాపి చల్లి, ముగ్గేసి, టీ తెచ్చి ఇచ్చింది. టీ కప్పు పక్కన పెట్టి తల్లిని ప్రేమగా, కృతజ్ఞతగా హత్తుకుని కౌగిలించుకుంది. ఆవిడ నవ్వింది. నలుగురు పిల్లల్లో ఈ రెండోది మేఘనే ఇలాంటి చేష్టలు చేస్తుంది. ఇదేమిటే అంటే – ప్రేమ ప్రకటన అంటుంది.

''చదువు... చదువు'' అని వెళ్ళిపోయిందామె.

***

రిజల్ట్సు వచ్చాయి. తొంభయి ఆరు శాతంతో క్లాసులో ఫస్టొచ్చింది మేఘన. అందరూ అభినందించారు. రివ్వున ఇల్లు చేరి తల్లికి మార్కులు చూపించింది. ఆమె ఆనంద భాష్పాలతో కూతుర్ని హత్తుకుంది. తండ్రి కూడా ''భేష్ – ఎప్పుడూ అలాగే చదువు'' అన్నారు. ఆరోజునుండీ తండ్రి కాస్త స్పెషలుగా మేఘనని పట్టించుకునేవారు. ఆ పిల్ల ఏదడిగినా తల్లి అమర్చిపెడ్తుంది. స్కూల్లోనూ విలువ పెరిగింది. దాంతో, అక్క చెల్లెళ్ళలో అసూయ చోటుచేసుకుంది. ఇహ చీటికిమాటికి వాగ్వివాదాలు, పేచీలు.

స్కూల్లో ఎక్స్‌కర్షన్‌కి తీసుకెళ్తాం అన్నారు రామప్పగుడికి. మంచి మార్కులు తెచ్చుకుందని మేఘనని వెళ్ళవచ్చని అనుమతించారు తండ్రి.

సున్నుండలు, చేగోడీలు, పూరీలు, పులిహోర చేసి ఇచ్చింది తల్లి. వెయ్యి జాగ్రత్తలు చెప్పి బస్సెక్కించింది.

***

అంత్యాక్షరి పాటల హోరుతో – రామప్ప చేరారు. అక్కడ గెస్ట్‌హౌస్‌లో మకాం. స్నానాలు చేసి రామప్పగుడికెళ్ళారు.

అద్భుతమైన శిల్పసౌందర్యం. నందీశ్వరుడైతే సజీవంగా వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నట్లుంది. ఆలయం మీద విగ్రహాలు, ముఖ్యంగా నాగిని శిల్పం చూశాక, కళా హృదయులు సజలనయనాలతో ఆ శిల్పికి అంజలి ఘటించారు. పరమాద్భుతమైన శిల్పచాతుర్యం ప్రతీ స్తంభం మీద కొలువు తీరింది. పరిపక్వత లేని పసివారేయైనా – ఆ విద్యార్థులు సైతం అబ్బురపడ్డారు.

ఆంధ్రులం మనం – గత మెంతో ఘనం

అదిగదిగో సాక్ష్యం – పుణ్యసాక్షాత్కారం –

ఆనాటి వైభవం – చరిత పుటల ఐశ్వర్యం –

ఈనాటి దర్శనం – మన జీవితం సార్థకం ... ఆంధ్రులం మనం ...

తెలుగు మాష్టారు భావావేశంతో ఆశువుగా ఆలపించారు. విన్నవారికి ఒడలు పులకరించాయి.

శత్రువుల దాడులకూ, కాలంచేసిన గాయాలకూ అప్పటికే శిథిలావస్థలో వుంది గుడి. ఉద్ధరించే రాజు లేరీ – మహనీయులేరీ? ఆవేదనగా అంటున్నారు పూజారిగారు.

గుడినుండి విహారాలకి పరుగులు తీశారు విద్యార్థులు.

''జాగ్రత్త – గంటలో వచ్చేయండి'' సార్ హెచ్చరిక.

అక్కడ ఒక వాగు ప్రవహిస్తోంది. అంతా అందులోకి దిగి నీళ్ళలో ఆడారు. తెచ్చుకున్న ఆహారం, ఫలహారాలు ఆరగించారు. స్వేచ్ఛగా, ఆనందంగా కేరింతలు కొడుతున్నారంతా. మేఘనకి ఎంతో ఆనందంగా వుంది. ఒక్కతే – ఆ వాగువెంట ముందుకు సాగింది. అలా అలా – అడవిలోకి వచ్చేసింది. సూర్యకిరణాల్ని అడ్డగిస్తూ మహావృక్షాల ఉపరితలాలు – పల్చని వెలుగు. ఆకుల పచ్చివాసన. తలకి

ఏదో గీరుతున్నట్లే – జరిగి తలెత్తి చూస్తి. ఎవరో – కోడిపుంజుని బలిచ్చి చెట్టుకొమ్మకి వేలాడదీశారు. దాని ముక్కే తలకి గీరుకుంది. కెవ్వున అరిచింది. ముందుకు పరిగెత్తింది. ఎదురుగా ఓ గుడి. భయంతో, బెదురుగా గుళ్ళోకెళ్ళింది. గబ్బిలాలు టపటప ఎగురుతూ వెళ్ళిపోయాయి. అంత చీకట్లో కూడా స్పష్టంగా కన్పిస్తుందో అమ్మవారి విగ్రహం. ప్రసన్నంగా, ఆదరంగా నవ్వుతున్నట్లుందా దేవత ముఖం. చిత్రంగా, బహుచిత్రంగా మేఘనలో ప్రశాంతత నిండుకుంది. తెలియని ఆనందం పొంగి పొర్లసాగింది. దిగంతాల్ని తన స్వరంతో తాకాలన్పించి పాడింది. భూమి పులకరించాలని ఆడింది. గంధర్వులో, కిన్నెరలో తనను పిలుస్తూ దాగుడు మూతలు ఆడుతున్నట్లు ఎటెటో పరుగులు తీసి అలసిపోయి అప్పుడు చూసిందామె. గుడివెనకభాగంలో – తోట. రకరకాల పూలతో, పళ్ళతో – తోట వెనక ఒకేమాదిరిగా వున్న దిబ్బలు. మట్టిదిబ్బలు. నరమానవులు కన్పించలేదు. పువ్వులు కోసి దేవతకి పుష్పాభిషేకం చేసింది. పళ్ళు నైవేద్యం పెట్టింది. తిరిగి వాగు దగ్గరకొచ్చింది.

గాలిలో తేలుతూ పిలుపులు – ''మేఘనా! మేఘనా! ఎక్కడున్నావ్ – రా! త్వరగా రా! మేఘనా''

''వస్తున్నా'' తిరిగి తను కేకపెట్టి వాగువెంట వెనక్కి వచ్చింది. టీచర్లు, పిల్లలంతా ఆందోళనా, విచార ముఖాలతో ఎదురుచూస్తున్నారు.

మేఘనని చూడగానే ఎంతో రిలీఫ్ చెంది చీవాట్లు వెట్టారు. సాయంత్రం ఐదు గంటలకల్లా తిరుగు ప్రయాణమయ్యారు. మేఘన మాత్రం తన అనుభవం తాలూకు అనుభూతిలో పూర్తిగా కూరుకుపోయి అవే నెమరు వేసుకోసాగింది. తన జీవితంలో సంభవించిన ఆ అనుభవం ఎన్నటికీ మరువలేనిది.

***

బస్సు తిరిగి స్కూలు ముందు ఆగింది. పిల్లలంతా బిలబిల దిగి ఒకరికొకరు బై, టాటా చెప్పుకుంటూ ఎవరి ఇండ్లకు వారు దారితీశారు. భుజంపై బ్యాగ్ వేసుకుని, ఇల్లు సమీపించింది మేఘన. ఇంటి ముందంతా జనం. ఏదో తెలియని ఆందోళనతో లోపలికొచ్చి దిగ్భ్రాంతితో కొయ్యబారిపోయింది. ఎదురుగా నేలపై పడుకోబెట్టి తల్లి శవం.

అమ్మా! దిక్కులు పిక్కటిల్లేలా అరిచి, తల్లి శవం పైబడి కరుచుకుపోయి బావురుమంది. ఆ పిల్లని వారించలేక, ఓదార్చలేక మిగతా అందరూ తిరిగి భోరుమన్నారు. కొందరు పెద్దలు, వృద్ధురాళ్ళు మేఘనని, మిగతా పిల్లల్ని విడదీసి చేయాల్సిన విధులు నిర్వహించారు. ఆఖరి ప్రయాణం తల్లిది. ముత్తయిదువుగా సవారీ ప్రయాణమైంది. పిల్లలంతా ఏడ్చీఏడ్చీ సొమ్మసిల్లిపోయారు. మేఘనకి స్పృహతప్పింది.

***

తల్లి పెద్దకర్మలు ముగిశాయి. పిల్లలకి లోకమంతా శూన్యంగా వుంది. ఓ సందర్భంలో కాంచన మేఘనకి చెప్పింది. ఆరోజు తల్లి వంటచేసి తండ్రికి వడ్డించిందట. అన్నం కొద్దిగా అడుగంటిందనీ. మాడువాసన వస్తుందని రంకెలేస్తూ తల్లి చెంప ఛెళ్ళుమన్పించి, నెట్టేశాడట తండ్రి. ఆ అదురుకి ఆమె తల గోడకి కొట్టుకుని, అప్పటికప్పుడు ప్రాణం పోయిందట. తలుపులు వేసేసి ఆమె గాయపు రక్తం తుడిచి, ఆరాక, తలుపులు తీసి హార్ట్‌ఎటాక్ అని చెప్పాడట అందరికీ. కళ్ళారా చూసిన పిల్లలకి మాత్రం నిజం తెల్సు. అంతా విన్న మేఘనకి రక్తం మరిగిపోయింది. తండ్రంటే వాళ్ళకి పరమ ద్వేషం ఏర్పడింది.

మరో నెలకల్లా మెరక వీధిలోని చంపకాన్ని ఇంటికే తెచ్చేసుకున్నాడు తండ్రి. పిల్లలకి నరకం ప్రారంభమైంది. ఉదయం బెడ్‌కాఫీ దగ్గర్నుంచీ, వేళకు టిఫిను, భోజనం – వంటంతా నయన చేయాలి. చంపకం తలకి నూనె రాసి, తలదువ్వి, వేన్నీళ్ళు స్నానాల గదిలో పెట్టడం వరకూ మేఘన చేయాలి. కాంచన దాని కాళ్ళు పట్టాలి. భావన దాని బట్టలుతకాలి. కళ్ళనీళ్ళతో, తల్లిని తల్చుకుంటూ రోజులు ఈడుస్తున్నారు.

మేఘనకి తిండి సహించడం లేదు. నిద్రపట్టదు. ఎలా ... ఎలా ఈ పీడ వదిలించుకోవాలి. తెగ ఆలోచించేది. రహస్యంగా పరిస్థితి అంతా మేనమామలకి ఉత్తరం రాసింది. స్కూలుకి వచ్చి కల్సుకోమంది. అలాగే – పెద్దమామయ్య స్కూలుకి వచ్చి మేఘనని కలిశాడు.

''మామయ్యా – ఉత్తరంలో వివరంగా రాశానుగదా – అదీ సంగతి. మీరే మమ్మల్ని రక్షించాలి. అందరం కుమిలిపోతున్నాము. అమ్మ ఎప్పుడూ అంటుండేది చిన్నమ్మయ్యకు నయనక్కనిచ్చి పెళ్ళి చెయ్యాలని. అదేదో త్వరగా చెయ్యండి. మిగిలిన మేమందరం హాస్టల్లో వుండి చదువుకుంటాం. అలా ఏర్పాటుచేయి మామయ్యా. నీ మాట మా నాన్న వింటారు.''

''తప్పకుండా అలాగే చేద్దాంలేమ్మా – వారం రోజుల్లో అక్కపెళ్ళి సింపుల్‌గా చేసేస్తాం. మిమ్మల్ని హాస్టల్‌లో చేర్పిస్తా. మీ అందిర బాధ్యత నాది. సరేనా?'' అన్నాడు.

అన్నట్లుగానే వారం రోజుల్లో నయన పెళ్ళి జరిగింది. పిల్లల్ని హాస్టల్లో చేర్పించారు. మేఘన కూడా ఆరోజే హాస్టల్లో చేరాలి. ఈలోగా ఆమె ముగించాల్సిన పనులున్నాయి. మందుల తాత అనీ ఆయుర్వేదం – పసరు వైద్య చేస్తుంటాడు. ఆయన దగ్గర్నుండి జుట్టంతా ఊడిపోయే రసం తెచ్చి చంపకం తలకి రాసుకునే నూనెలో కలిపేసింది. కళ్ళకి తగిల్తేనే గుడ్డితనం వచ్చేసే పొడిని చంపకం పెట్టుకునే కాటుకలో కలిపింది. ఒళ్ళంతా చచ్చుబడి, పక్షవాతం వచ్చే మందుని తండ్రి తాగే సారాలో కలిపేసింది. తండ్రి పర్సులోంచి వంద రూపాయల నోటు తీసుకుంది. అక్కనీ, చెల్లెళ్ళనీ ఆఖరిసారి చూసి రామప్పగుడికి వెళ్ళే బస్సు ఎక్కి కూచుంది.

బస్సయితే ముందుకు ప్రయాణిస్తోంది గానీ – మేఘనకు అంతా శున్యంగా వుంది. మొత్తం జీవితం స్థంభించిపోయినట్లుంది. మనసు మరణిస్తే – కట్టె మాత్రం కాలంతోపాటుగా కొట్టుకుపోతున్నట్లుంది.

రామప్పలో బస్ ఆగింది. మేఘన బస్‌దిగి రామప్ప గుడికెళ్ళింది. శివుడి దర్శనం చేసుకుంది. ''తండ్రీ – శంకరా – అమ్మని నీ దగ్గరే వుంచుకో. అక్కనీ, చెల్లెళ్ళనీ కాపాడు స్వామీ'' అని దండం పెట్టుకుంది.

వాగు దగ్గరకొచ్చింది. ఇదివరకు లాగా వాగు వెంబడి అడవి లోపలికి వచ్చేసింది. గుడి దగ్గరకు వచ్చింది. దేవతను దర్శించుకుంది. ఇదివరకు లాగానే – ప్రశాంతి! ఆనందం, తెలీని సంతోషం – ఆ ఆనందం కూడా అలౌకికమైన ఆనందం. శాంతి, శాంతి. ప్రశాంత సముద్రంలా ఎవ్వరూ జ్ఞాపకం రావడం లేదు. వాగులో ఈతలు, స్నానాలు. పళ్ళే ఆహారం. పువ్వులే నేస్తాలు. దేవతే ఆత్మీయురాలు. గుళ్ళోనే నిద్ర.

అలా ఎన్నెన్ని రోజులు గడిచాయో – ఆ గుడి దగ్గరకే ఓ యువకుడు వచ్చాడు ఒకరోజు.

''అమ్మాయీ – ఎవరు నువ్వు'' అనడిగాడతను.

''ననెవర్నో తర్వాత చెప్తాలే. ముందు నువ్వెవరో చెప్పు''

''నాపేరు చంద్రహాస. ఈ గుడి వెనక వుండే వాళ్ళం. నేను ఉద్యోగార్థం కువైట్ దేశానికెళ్ళాను. అప్పుడిక్కడ వాగులు పొంగి వరదలొచ్చి రాత్రివేళ మా గుడిసెలన్నీ మునిగిపోయాయి. ఎవ్వరూ బ్రతకలేదు. మా గుడిసెల మీద మట్టికుప్పలు పేరుకుపోయి దిబ్బలుగా మారిపోయాయి. ఈ పూలవనాలూ, పళ్ళతోటలూ మేము వేసుకున్నవే. ఈ దేవత మా ఇలవేలుపు. ఆమె ముఖం చూస్తే చాలు. సర్వపాపాలూ హరించబడి – స్వర్గలోకపు ఆనందం కల్గుతుంది. ఈమె పేరు నిత్యసంతోషిమాత. ఇప్పుడు నీ

సంగతులు చెప్పు.''

''నా పేరు మేఘన. అమ్మ, నాన్న లేరు. ఒకసారి ఎక్స్‌కర్షన్‌కి వచ్చినపుడు ఈ స్థలం చూశాను. ఈ ప్రశాంతత నాకెంతో నచ్చింది. అందుకే – నా ఒంటరి జీవితం ఇక్కడే గడపాలని వచ్చేశా. ఒకపాట విన్నావా? 'జగమంత కుటుంబం నాదీ – ఏకాకి జీవితం నాది' అనీ – ఈ అడవి ప్రపంచం నాది. ఏకాకి జీవితమూ నాదే'' అంది.

''మేఘన! ఎంత అందమైన పేరు? నువ్విక ఏకాకివెందుకౌతావ్? నేను నీకు తోడున్నానుగా – జాజి పూవు రెక్కలా, జాబిలి ముక్కలా వున్నావ్!''

''సంతోషం'' అంది నవ్వుతూ.

అది మొదలు వారి స్నేహం గాఢాతిగాఢమైంది.

మాటలు – మాటలు – మాటలు – పాటలు – పాటలు – పాటలు –

ఆటలు – ఆటలు – ఆటలు – పూజలు – పూజలు – పూజలు –

ఎన్ని నెలలు గడిచిపోయాయో. ఆకురాలే కాలం, చిగుళ్ళు వేసే వసంతకాలం, వర్షం వస్తే వర్షాకాలం, చలివేస్తే చలికాలం, ఎండాకాలం ఇలా అడవినీ, ఋతువుల్నీ చూస్తూ తెల్సుకోవడమే. బయటి ప్రపంచంలోకి వాళ్ళు వెళ్ళలేదు. తెలీదు. చంద్రహాస బట్టలే మేఘన వేసుకునేది. పాములు, తేళ్ళు, జెర్రులు మేఘనని చేరకుండా చంపేసేవాడు చంద్ర. నెగళ్ళు వేసుకుని మృగాల నుండి రక్షించుకునేవారు. వాగులో ఈతలు కొట్టేవారు. కాలం గడిచేకొద్దీ చంద్రహాసలో ఆశ మొలకెత్తి బలపడసాగింది.

***

ఆరోజు పౌర్ణమి. వాగంతా వెన్నెల ప్రవాహంలా వుంది. పచ్చని పచ్చికమీద పడుకుని ఆకాశాన్ని, చంద్రుడ్నీ, తారకల్నీ, మేఘాలనీ చూస్తున్నారిద్దరూ. జానపదుల ప్రేమగీతం మధురంగా పాడుతున్నాడు చంద్రహాస. హృదయపూర్వకంగా, ఆర్తితో సమర్పణగా పాడుతున్నట్లుంది. మేఘన హృదయం కూడా ఆర్ద్రమైపోయింది.

''అంత గాఢమైన ప్రేమతో పాడుతున్నావు, ఎవరోయ్ నీ ప్రేయసి?'' ఆటపట్టిస్తూ అడిగింది మేఘన.

''ఆకాశంలోని చంద్రుని వెన్నెల నిన్ను తాకుతోంది. ఎదురుగా వున్న ఈ చంద్రుని ప్రేమ వెన్నెల నిన్ను తాకడం లేదా?''

ఒక్కక్షణం స్థబ్దురాలై – తేరుకుని – ''అదే – అదే మరి. ఎదురుగా వున్నాను గనుకే – నీ ప్రేమని గ్రహిస్తున్నాను. కానీ దూరాన వున్న నీ ప్రేయసికి తెల్సేదెలా?''

అతడు నిట్టూర్చి ''ఎదురుగా వున్న అపరంజి బొమ్మనే నేను ప్రేమిస్తున్నాను. చూడు చూడు. నిండు చంద్రుడ్ని ఆ మేఘం ఎలా కమ్మేసి తన వెనక ఎలా దాచేసిందో – ఈ చంద్రుడ్ని కూడా ఈ మేఘన కమ్మేసింది. నిఝంగా నిజం. ఈ పంచభూతాల సాక్షిగా – ఇప్పుడు నేన్నీకు చెప్తున్నాను. నువ్వంటే నాకు ప్రాణం. ఆ దేవతతో సమానమైన ఆరాధన. ఎలాగూ కల్సి జీవిస్తున్నాం. సహజంగా నాపై నీకు ప్రేమ కలగాలని మన స్నేహం పునాదిపై ప్రేమ సౌధం నిర్మించుకున్నాను. అందులో నా రాణిని నీవే.''

''సృష్టిలో తీయనిది స్నేహమంటారు. ఆ స్నేహాన్ని మలినపర్చకు. ప్రేమ ఓ పైత్యం.''

''మేఘనా! నేనంటే నీకెంతో ఇష్టం. కదూ – ఆ ఇష్టమే ప్రేమ. ప్రేమ పరాకాష్టే శృంగారం. పెళ్ళి అనే బంధంతో మనం భార్యాభర్తలమై శృంగార రాజ్యాన్ని ఏలుదాం. సంతానాన్ని పొందుదాం. నా దగ్గర చాలా ధనముంది. పిల్లల్ని చక్కగా పెంచుకోవచ్చు. ఇంక ఈ అజ్ఞాతవాసమెందుకు?''

''ఇంతవరకూ మనం ఎంత స్నేహంగా ప్రాణానికి ప్రాణంగా వున్నాం. అది చాలు నాకు.''

''నాకు చాలదు మేఘనా – నా ప్రాణాధికంగా నిన్ను ప్రేమిస్తున్నాను. నీవల్ల కొడుకులు, నీలాంటి కూతుళ్ళూ కావాలి. మనం తప్పక పెళ్ళి చేసుకుందాం. నిన్ను ప్రేమతో గెలవాలనే ఇంతకాలం నిగ్రహంగా వున్నాను. ఆమె మౌనం వహించింది.

***

ఆ రాత్రి నిద్రపట్టలేదు మేఘనకు. కళ్ళు మూసినా, కళ్ళు తెరచినా, తన తండ్రి తల్లి జుట్టుపట్టుకుని ఈడ్చుతూ తన్నడం, చుట్టతో వాతలు పెట్టడం, ముఖమ్మీద వేడి వేడి టీ ఒంపడం – పీడకలల్లాంటి దృశ్యాలు – అమ్మా, అమ్మా అని ఏడ్చింది.

ఒద్దు, ఒద్దొద్దు. తను ఎంతమాత్రం పెళ్ళి చేసుకోదు. ఏమో – ఎవరు చెప్పారు? ఈరోజు చంద్రం బాగుండవచ్చు. మంచివాడిగా వుండచ్చు. పెళ్ళయ్యాక భర్తననే అహం, అధికారం మదం చూపించడని గ్యారెంటీ ఏమిటి? తెగని ఆలోచనలు. తల పగిలిపోతుంది. లేచి కూచుంది. చంద్రహాస హాసాలు చిందిస్తూ ఆదమరిచి నిద్రపోతున్నాడు. నిలబడి నెమ్మదిగా వాగువైపు కదిలింది. ఒడ్డుకు చేరింది. ప్రకృతినంతా పరికించింది. వాగులో అడుగు పెట్టింది.

***

తెల్లారి లేచిన చంద్రహాసకి మేఘన కన్పించలేదు. వాగు దగ్గరకు పరుగుతీశాడు. మేఘనా – మేఘనా అంటూ వాగువెంట పరిగెత్తాడు. దూరంగా బండరాయికి చిక్కుకుని ఆమె ఎర్ర ఓణీ. ఆ ప్రాంతమంతా సుడిగుండాలమయం. భయంతో గజగజలాడుతూ ''మేఘనా!'' అంటూ ప్రకృతి ప్రతిధ్వనించేలా అంగలార్చాడు.

***

ఎన్నేళ్ళు గడిచాయో – అమ్మవారి విగ్రహం పక్కనే ఓ రాయికి కట్టబట్టిన ఎర్ర ఓణీ జీర్ణావస్థలో వుంది. జడలు కట్టిన జుట్టు, గడ్డంతో ఆ సాములోరు ఆ గుడిమెట్లమీదే కూచుని వుంటాడు. ప్రతిరోజూ ఆ ఎర్రఓణీకి పువ్వులతో అభిషేకం చేయడం ఒక్కటే అతడి జీవిత పరమావధి. మేఘాలలోని మేఘనని చూస్తూ మాట్లాడుతూ వుంటాడు. గట్టిగా పిలుస్తూ వుంటాడు.

మేఘనా – మేఘనా – అని!

(ప్రేమా; పిచ్చీ ఒకటే – నువ్వూ నేనూ – వేరే)

ఒక్కమగాడు

ముసాఫిర్ చిత్రంలో నటించి విమర్శకుల నోటికి తెగ పని పెట్టిన సెక్సీ హీరోయిన్ సమీరా రెడ్డి టాక్సీ 9211 హిట్ కావడంతో ఇప్పుడు గెలుపు గుర్రంపై స్వారీ చేస్తోంది. 'ముసాఫిర్ ఫ్లాఫ్ అయినందుకు నాకేం బాధలేదు. ఎందుకంటేఅవకాశం వచ్చింది కదాని ఏది పడితే అది ఒప్పుకోకుండా నాకు బాగా గుణపాఠం నేర్పింది. టాక్సీ 9211 రిలీజయ్యేటప్పటికే నా చేతినిండా ఆఫర్లున్నాయి. అంతమంచి సినిమాలో నటించినందుకు నాకు చాలా గర్వంగా వుంది' అని చెబుతోంది. అంతేకాదు జూనియర్ ఎన్టీఆర్‌తో ఆమెకేదో... అఫయిరుందని ఇండస్ట్రీలో ఒకటే చెవులు కొరుక్కుంటున్నారు. అయితే ఆమె అందుకేమాత్రం బాధపడట్లేదు సరికదా, వుంటే తప్పేంటి? అతనొక్కడే నాకు నచ్చిన మగాడు. అందగాడు, కోడెవయసువాడు, పైగా పెళ్ళికాని వాడు. అఫయిర్లు మరి అలాంటి వారితో గాక ఇంకెవరితో వుండాలేమిటి? అని ఎదురు ప్రశ్న వేస్తోంది.